క్లుప్తంగా

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత



మృతుడి భార్యకు బీమా చెక్కు అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: వైఎస్సార్ బీమా పథకం ద్వారా వచ్చిన లక్ష రూపాయల పరిహారాన్ని మృతుడి కుటుంబానికి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అందజేశారు. 51వ వార్డు ఏకలవ్య కాలనీలో నివాసముంటున్న అప్పన్న అనే వ్యక్తి మరణించడంతో అతడి కుటుంబానికి వైఎస్సార్ బీమా ఆసరాగా నిలిచింది. మృతుడి భార్య సుశీలకు శుక్రవారం వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ వెంకటరమణ బీమా చెక్కును అందజేశారు. 290 సచివాలయ వలంటీర్ రోషిణి తదితరులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొట్టిన లారీ



ట్రాఫిక్ ఐలెండ్‌పైకి దూసుకెళ్లిన బస్సు

మద్దిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సును తాటిచెట్లపాలెం వద్ద లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. వివరాలిలా.. అక్కయ్యపాలెం నుంచి ఎన్ఏడీ వైపు వెళ్తున్న ఒక లారీ.. ఊర్వశి జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్తున్న బస్సును ఢీకొంది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు లారీని తప్పించబోయి, రోడ్డు మధ్యలో గల ట్రాఫిక్ ఐలెండ్‌పైకి దూసుకుపోయింది. దీంతో ఐలెండ్ ధ్వంసం కాగా.. బస్సు డ్రైవర్‌కు, లోపల ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే కంచరపాలెం పోలీసులు, 108 సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించారు. కంచరపాలెం పోలీసులు పరిస్థితిని సమీక్షించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు, పండ్లు అందిస్తున్న సుజాత

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం యల్లబిల్లివారి వీధిలో శుక్రవారం బర్మా కాందిశీకుల నిరుద్యోగ్యుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలు కె.అమరావతి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు సంఘ సభ్యులు దుప్పట్లు, పండ్లు, ఫలహారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా దళిత నాయకురాలు డాక్టర్ ఈతలపాక సుజాత అమరావతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బర్మా కాందిశీకులకు ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హరి, ఇ.ఈశ్వరరావు, వంశీ, యశ్వంత్, దేవి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళింగుల ఆత్మీయ కలయికకు ఏర్పాట్లు



ఆహ్వాన పత్రిక అందిస్తున్న పేడాడ రమణికుమారి

మద్దిపాలెం: మాధవధార మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 29న కళింగుల ఆత్మీయ కలయిక నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళింగ కుటుంబ సభ్యులను కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. కళింగ బృందంతో కలిసి మాధవధారలో ఆమె పర్యటించి ఏర్పాట్లు పరిశీలించారు.

ఆహ్లాదంగా.. ఆధునికంగా..

- నగరానికి మరింత వన్నె తెచ్చేలా రూపుదిద్దుకుంటున్న ఉద్యానవనం
- బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో స్నీపర్ పార్కు నిర్మాణం
- రూ.2.5 కోట్లతో శరవేగంగా పనులు



పార్కులో వాకింగ్ ట్రాక్

సీతమ్మధార: అందాల విశాఖ నగరానికి మరింత వన్నె తెచ్చేలా మరో పార్కు రూపుదిద్దుకుంటోంది. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని, మానసిక ప్రశాంతతను అందించేలా ఉద్యానవనం సిద్ధమవుతోంది. జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో స్నీపర్ పార్కు(రాకెట్ పార్కు) నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందరికీ అనువుగా.. అన్ని సదుపాయాలతో ఈ పార్కును తీర్చిదిద్దుతున్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకాలకు అనుగుణంగా నగరంలోని ఖాళీగా ఉన్న జీవీఎంసీ స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా జీవీఎంసీ జనరల్ ఫండ్స్ రూ.2.5 కోట్లతో స్నీపర్ పార్కును సిద్ధం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే దీనిని ప్రారంభించనున్నారు.



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో నిర్మిస్తున్న స్నీపర్ పార్కు

పార్కు ప్రత్యేకతలు..

నగరంలో ఒక ప్రత్యేకమైనదిగా అన్ని హంగులతో స్నీపర్ పార్కును నిర్మిస్తున్నారు. ఇందులో నాలుగు వాకింగ్ ట్రాక్‌లు, సీతాకోకచిలుకల ఉత్పత్తి కేంద్రం, పిల్లల ఆట స్థలం, వర్షం ఆశ్రయాలు, పెర్గోలా నాలుగు, లిల్లీపాండ్, పెవిలియన్, టాయిలెట్స్, గెజిబో, ధ్యానం, యోగా కేంద్రాలు, యాంపీ థియేటర్, నీటి సరఫరా, బిందు సేద్యం వ్యవస్థ ఏర్పాటు చేశారు. స్థానికులందరూ ప్రతి రోజూ వాకింగ్ చేసేలా ఇసుకతో ట్రాక్ తయారు చేశారు. చిన్న పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆట సామగ్రితోపాటు ఆధునిక జిమ్ పరికరాలను అందుబాటులో ఉంచారు. పార్కు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతుంది. అన్ని వసతులతో పార్కును నిర్మించి ప్రారంభించనుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆధునిక జిమ్, ఆట పరికరాలు

త్వరలో పార్కు ప్రారంభం

బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఆధునిక హంగులతో నిర్మిస్తున్న స్నీపర్ పార్కును మరికొద్ది రోజుల్లో ప్రారంభిస్తాం. మొక్కలు నాటాల్సి ఉంది. అది పూర్తయితే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం

– శ్రీనివాస్, ఈఈ, జీవీఎంసీ

ప్రజలకు ఆహ్లాదం పంచేలా..

బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో చక్కటి వాతావరణంలో స్నీపర్ పార్కును ఏర్పాటు చేస్తున్నాం. పిల్లలు, పెద్దలు, మహిళలు, వృద్ధులు సేదతీరేందుకు వీలుగా ఉంటుంది. త్వరలోనే ప్రారంభిస్తాం.

– కె.అనిల్‌కుమార్‌రాజు, కార్పొరేటర్, 14వ వార్డు

అక్కయ్యపాలెం పరస రేపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గౌరీ సేవా సంఘం ప్రతినిధులు బొడ్డేటి మోహన్, వేణుగోపాల్

సీతంపేట: గౌరీ సేవా సంఘం అక్కయ్యపాలెం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ ఆదివారం భూలోకమాంబ, ముత్యమాంబ, కుంచుమాంబ, వేంకటేశ్వర స్వామి, సీతారాముల వారి పరస మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం అక్కయ్యపాలెం మూడు గుళ్ల వద్ద సంఘ మాజీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ మాట్లాడుతూ ఆరోజు ఉదయం 5 గంటలకు అమ్మవార్ల ప్రథమ పూజతో పరస ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు తప్పెట గుళ్లు, సేవా గరిడీలు, కోలాటం వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలంకరణతో పరస కనుల పండువగా జరుగుతుందన్నారు. ప్రజలంతా అమ్మవార్లను దర్శించి పరసను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు పి.ఎస్.జె.వి.ప్రసాద్, చైర్మన్ రాపేటి మాలినాయుడు, ఉపాధ్యక్షుడు మాదేటి శ్రీనివాసరావు, డిప్యూటీ ప్రెసిడెంట్ మళ్ల త్రినాథరావు, కార్యదర్శి ఆదారి పారుపల్లి రవి, కోశాధికారి పిల్లా గోపి, పాలకవర్గ సభ్యులు పెంటకోట శ్యామ్, కర్రి బాబ్జి, పెంటకోట ఉమ, కర్రి శంకర్, కన్నా, కాండ్రేగుల గణేష్, రాజగిరి అప్పలరాజు పాల్గొన్నారు.

'ఎస్‌ఏ 1'లో ప్రతిభావంతులకు అభినందనలు



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం శాంతికుమారి

సీతంపేట: స్థానిక మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇటీవల ఎస్ఏ 1 పరీక్షలు నిర్వహించారు. వాటిలో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను శుక్రవారం హెచ్‌ఎం శాంతికుమారి అభినందించారు. పాఠశాలలో 55 మంది ఇంగ్లిష్ మీడియం, 31 మంది తెలుగు మీడియం చదువుతున్నారు. వీరిలో ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు స్పందన, భోగేష్, హర్షిత దీప్తి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. తెలుగు మీడియం నుంచి గాయిత్రి, జ్యోత్స్న, యామిని మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరిని హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించి, భవిష్యత్ మంచి మార్కులు సాధించేలా శ్రమించాలన్నారు. మిగిలిన విద్యార్థులు కూడా మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నామని హెచ్‌ఎం తెలిపారు.

తొమ్మిదేళ్ల బాలుడికి డెంగ్యూ



బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఏడీ ప్రసాదరావు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు గొల్ల వీధికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడికి డెంగ్యూ జ్వరం సోకింది. కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న బాలుడికి కేజీహెచ్‌లో రక్త పరీక్షలు చేయించగా.. డెంగ్యూ జ్వరంగా నిర్ధారణైంది. దీంతో జీవీఎంసీ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తమై శుక్రవారం వ్యాధిగ్రస్తుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఇంటి చుట్టుపక్కల ఫీవర్ సర్వే నిర్వహించారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా, డెంగ్యూ కారక దోమలు ఎక్కడైనా పెరుగుతున్నాయా అని నీటి నిల్వలు తనిఖీ చేశారు. దోమ లార్వాలు పెరుగుతున్న నీటిని గుర్తించి పారబోశారు. దోమలు పెరిగే ప్రదేశాలు, దోమలు వృద్ధి చెందకుండా, జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.ఎస్.ప్రసాదరావు, సూపర్‌వైజర్ రత్నం, హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరెడ్డి, కరణ్, హెల్త్ వర్కర్ సుధాకర్, హెల్త్ సెక్రటరీ, ఆశ, వలంటీర్లు, యాంటీ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న మనోజ్ మృతదేహం

మద్దిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్దిపాలెం ఎఫ్‌సీఐ గొడౌన్ దగ్గరలో ఒక వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం అర్ధరాత్రి దాటాకా జరిగింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి పేరు మనోజ్ అని, సుమారు 29 ఏళ్ల వయసు ఉండొచ్చని, ఉత్తరాది ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా పోలీసులు చెబుతున్నారు. చెత్తాచెదారం, ప్లాస్టిక్, ఇతర వస్తువులు ఏరుకుంటూ వాటిని స్క్రాప్ దుకాణాలకు విక్రయించగా వచ్చిన డబ్బులతో మద్యం తాగుతుండేవాడని స్థానికులు తెలియజేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్ఐ రవికిషోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీకాలనీ: ఈ నెల 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'బాలికలపై నేరాలను నివారిద్దాం-నిర్భయంగా జీవించనిద్దాం' అనే అంశంపై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది.

నెట్‌బాల్ టోర్నీలో 'బుల్లయ్య' విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: ఏవీఎన్ కాలేజీలో ముగిసిన ఆంధ్రా యూనివర్సిటీ అంతర కళాశాలల పురుషుల నెట్‌బాల్ టోర్నమెంట్‌లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం వారిని బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించి క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి విద్యార్థులను అభినందించారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నియంత్రణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారి ఉమాదేవి

ఏయూ క్యాంపస్: అవగాహన, అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వాణిజ్య అధికారి ఎం.బి ఉమా దేవి చెప్పారు. శుక్రవారం సాయంత్రం బీచ్‌రోడ్డు లోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో విద్యార్థులకు ఇంట్లో గ్యాస్‌స్టవ్ వినియోగం–తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్ స్టవ్ వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న పొరపాటు జరిగినా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సంస్థ ప్రాంతీయ అధికారి జోషి మాట్లాడుతూ ప్రమాదానికి దారితీసే సందర్భాలు, కారణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తేజ, మనోరమ, సూర్యారావు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి పాల్గొన్నారు.

గాంధీ అధ్యయన కేంద్రం సందర్శన



డాక్టర్ రావుకు పుస్తకాన్ని బహూకరిస్తున్న చల్లా రామకృష్ణ

ఏయూ క్యాంపస్: జపాన్‌కు చెందిన శాస్త్రవేత్త, పారిశ్రామికవేత్త డాక్టర్ ఎస్ వీఎస్ రావు శుక్రవారం ఏయూ లోని గాంధీ అధ్యయన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జపనీయులు గాంధీజీ పని సంస్కృతిని అనుసరిస్తారని చెప్పారు. విద్యార్థుల్లో గాంధేయ ఆలోచనలు, సిద్ధాంతాలను ప్రోత్సహిస్తున్న వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డిని అభినందించారు. మహాత్మా గాంధీపై ఫారినర్స్ వ్యూస్ అనే పుస్తకాన్ని డాక్టర్ రావుకు గాంధీయన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ అందజేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన



రైల్వే న్యూకాలనీ జంక్షన్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వీసీటీపీఎల్ భద్రతా సిబ్బంది

తాటిచెట్లపాలెం: రహదారులపై ప్రయాణించేటపుడు వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వీసీటీపీఎల్ సేఫ్టీ విభాగం సిబ్బంది సూచించారు. ఈమేరకు శుక్రవారం రైల్వే న్యూకాలనీ, స్టేషన్ రోడ్ జంక్షన్ల వద్ద రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు విధిగా సీట్‌బెల్ట్ ధరించాలని సిగ్నల్ పాయింట్ల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ, స్లోగన్‌ల ద్వారా తెలియజేశారు. ప్రజలంతా నిబంధనలు పాటించి ప్రమాద రహిత విశాఖకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీరి ప్రయత్నానికి పోర్ట్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు సంఘీభావం తెలిపి కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమాచారమ్

జోన్-5లో ఆధార్ కేంద్రాలివే..



జీవీఎంసీ జోన్-5 కార్యాలయం


వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని పలు వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవా కేంద్రాలను ప్రారంభించారు. ఆధార్ కార్డులో తప్పులు, సవరణలు, కొత్తగా నమోదు వంటి ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చు. ఈ నెల 24 వరకు ప్రత్యేక క్యాంపులు కొనసాగుతాయి. ఉత్తర నియోజకవర్గంలోని వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆయా వార్డుల ప్రజలు సద్వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

ఆధార్ సేవలకు సంప్రదించండి

వార్డు సచివాలయం	కోడ్ నంబర్	ఇన్‌చార్జి	ఫోన్ నంబర్
న్యూ వేంకటేశ్వర కాలనీ	21086246	కె,మోహన్‌రావు	94936 32327
నరసింహనగర్	21086253	కె.కోటేశ్వరరావు	97033 30393
సంజీవ్ కాలనీ	21086260	ఎన్.శివరామకృష్ణ	96520 96465
అంబేడ్కర్ కాలనీ	21086287	జి.ప్రభాకర్	94943 10435
మహతి కాలనీ	21086288	జి.రంజిత	84648 39310
మాధవధార	21086289	జి.వెంకటేష్	99667 14743
గాంధీ నగర్	21086290	ఎస్.నవ్యపల్లవి	78426 23525
యూడీపీ కాలనీ	21086294	ఎన్.నరేంద్ర	81257 17262
భవానీ గార్డెన్	21086302	జి.భవాని	96663 67380
గణేష్ నగర్	21086303	ఎం.కుమారి	87906 98924
ఇండస్ట్రియల్ కాలనీ	21086340	ఉత్తమ్ చౌదరి	90523 36526

గడప గడపకూ సంక్షేమ ఫలాలు



48వ వార్డులో సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 48వ వార్డు బాపూజీనగర్ సచివాలయాల పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి నీలి రవితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. వార్డులో ఇటీవల శంకుస్థాపన చేసిన పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, పార్టీ సీనియర్ నాయకుడు కర్రి రమారెడ్డి, డైరెక్టర్లు రాయుడు శ్రీను, డి.రమేష్ పి.పద్మా, భూలోక, భాస్కర్, ముక్క రమణ, శంకర్, దామోదర్, గుజ్జుబాబు, జీవీఎంసీ, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రైళ్ల పరిశుభ్రతకు సహకరించండి

ప్రయాణికులకు డీఆర్‌ఎం విజ్ఞప్తి



డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైళ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయాణికులు సహకరించాలని, ఇది అందరి బాధ్యతని డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి అన్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం చేరుకున్న వందేభారత్ రైలును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు హౌస్‌కీపింగ్ సిబ్బంది రైలును శుభ్రం చేస్తున్నా కూడా విశాఖకు చేరేసరికి పలు కోచ్‌ల నిండా ప్లాస్టిక్ బాటిల్స్, పేపర్ కప్స్, వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేసి ఉన్నాయని చెప్పారు. పరిస్థితిని చూసిన డీఆర్‌ఎం స్పందిస్తూ డోంట్ బీ బిట్టర్–స్టాప్ ద లిట్టర్ అని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ప్రతిష్టాత్మక వందేభారత్ రైలు శుభ్రంగా ఉంచాలని, దీనికోసం డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారని తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో సిద్ధం కండి



మాట్లాడుతున్న జేఈఈ నిపుణుడు మస్తాన్‌రావు

సీతంపేట: ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో జేఈఈ మెయిన్స్ పరీక్షలకు సన్నద్ధం కావాలని జేఈఈ శిక్షణ నిపుణుడు, ఫిట్జీ మేనేజింగ్ పార్ట్‌నర్ పెండేల మస్తాన్‌రావు సూచించారు. ఈ నెల 24 నుంచి 31 వరకు జేఈఈ మెయిన్స్ తొలి విడత పరీక్షలు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం శంకరమఠం రోడ్‌లోని ఒక హోటల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ మూడు సబ్జెక్టుల్లో సమతుల్యత పాటించాలన్నారు. పరీక్షలు సమీపించినందున నిర్దిష్టమైన నిద్ర, ఆహార వేళలు పాటించాలని సూచించారు. ఏకాగ్రతతో చదువుతూ పూర్తిగా పట్టులేని అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. కొత్త విషయాల జోలికి చివరి నిమషంలో పోవద్దని చెప్పారు. జేఈఈ నమూనా పరీక్షలు రాయాలని, చదువు విషయంలో ఒత్తిడికి గురైతే అధ్యాపకులను సంప్రదించి సలహాలు పొందాలని సూచించారు. ప్రతి రోజూ కొంత సమయం మనసుకు ఉల్లాసం కలిగించే పనులు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాన్ని ముందు రోజు సందర్శించాలని, అడ్మిట్ కార్డు, విద్యార్థి గుర్తింపు కార్డు పరీక్ష రోజు మర్చిపోకుండా తీసుకెళ్లాలన్నారు. మెదడును ప్రశాంతంగా, ఒత్తిడి లేకుండా ఉంచేందుకు తగు చర్యలు తీసుకుని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని పరీక్ష రాయాలని మస్తాన్‌రావు పేర్కొన్నారు.

పబ్లిక్ డిమాండ్

రోడ్డెక్కిన మురుగుతో ఇబ్బందులు



శాంతిపురం రోడ్డులో లీకవుతున్న మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు శాంతిపురం రోడ్డులోని నైస్ జిమ్ సమీపంలో యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగు నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. సమీప నివాసులు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

– బి.మోహన్‌రావు, శాంతిపురం